APTEL/2009/29308

# స్నేహిత ఎక్స్‌ప్రెస్

నిజం దాగదు.. వార్త ఆగదు

తెలుగు దినపత్రిక

05.01.2026
సోమవారం
హైదరాబాద్
సంపుటి : 17 సంచిక: 76
పేజీలు: 4 వెల: రూ.5
ఎడిటర్ : రాథోడ్ వినోద్ కుమార్
Follow:
https://epaper.expresstelugudaily.com

విద్యార్థులు ఇష్టపడి చదివితేనే

## మంచి ఫలితాలు

10వ తరగతిలో 100 శాతం ఫలితాలు సాధించాలి

సబ్ కలెక్టర్ ఉమా హారతి 04



## ఒలింపిక్స్ 2036 నిర్వహణకు భారత్ రెడీ


- ఒలింపిక్ క్రీడల కోసం భారత్ పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతుంది
- ప్రధాన మంత్రి నరేంద్రమోదీ



వారణాసి, స్నేహిత ఎక్స్ ప్రెస్:

ఒలింపిక్స్-2036 క్రీడలను నిర్వహించేందుకు భారత్ పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు. గత పదేళ్లలో అంతర్జాతీయ క్రీడలకు భారత్ వేదికగా నిలిచిందన్నారు. వారణాసిలో 72వ జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీల ప్రారంభోత్సవంలో ప్రధాని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. గత దశాబ్ద కాలంలో భారత్‌లో 20కిపైగా అంతర్జాతీయ క్రీడా పోటీలు నిర్వహించామని గుర్తుచేశారు. అండర్ - 17 ఫిఫా వరల్డ్‌కప్, హాకీ వరల్డ్ కప్, చెస్ టోర్నమెంట్ వంటి అంతర్జాతీయ ఈవెంట్లకు భారత్ విజయవంతంగా ఆతిథ్యం ఇచ్చిందన్నారు. 2030లో జరిగే కామన్వెల్త్ గేమ్స్ కూడా భారత్‌లోనే జరగనున్నాయని తెలిపారు. 2036లో ఒలింపిక్ క్రీడల కోసం భారత్ పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోందని చెప్పారు. భారత్ అభివృద్ధి వృత్తాంతాన్ని ప్రధాని మోదీ వాలీబాల్ ఆటతో పోల్చారు. ఏ విజయమైనా ఒక్కరి వల్ల సాధ్యం కాదనే విషయాన్ని ఈ క్రీడ తెలియజేస్తుందని, మన సమన్వయం, విశ్వాసం, జట్ల సంసిద్ధతపైనే మన విజయం ఆధారపడి ఉంటుందన్నారు. ఇందులో ప్రతి ఒక్కరి పాత్ర, బాధ్యత ఉంటుందని, వాటిని నెరవేర్చినప్పుడే మనం విజయం సాధిస్తామన్నారు.

# ఏపీ ప్రాజెక్టుకు బ్రేక్ వేయడమే లక్ష్యం!



- పోలవరం-నల్లమల సాగర్‌పై సుప్రీంలో యుద్ధం
- అభిషేక్ సింఘ్వీతో సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ కీలక భేటీ
- నేడు సీజేఐ బెంచ్ ముందు విచారణ..
- అనుమతులు లేని పనులను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్
- అనుమతులు లేని విస్తరణ పనులను ఆపాల్సిందేనని తెలంగాణ పట్టు

హైదరాబాద్, స్నేహిత ఎక్స్ ప్రెస్:

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా తలపెట్టిన పోలవరంనల్లమలసాగర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రభుత్వం తన న్యాయ పోరాటాన్ని ఉధృతం చేసింది. ఈ ప్రాజెక్టును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టులో కీలక విచారణ జరగనుంది. పొరుగు రాష్ట్రమైన తెలంగాణ అభ్యంతరాలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా ఏపీ ప్రభుత్వం ఏకపక్షంగా ముందుకు సాగడాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అంతర్ రాష్ట్ర నదీ జలాల వివాదాల చట్టంతో పాటు ఏపీ పునర్ వ్యవస్థీకరణ చట్టం నిబంధనలను తుంగలో తొక్కి చేపడుతున్న ఈ ప్రాజెక్టుకు తక్షణమే బ్రేక్ వేయాలని తెలంగాణ తన పిటిషన్‌లో గట్టిగా కోరింది.

**పేరు మార్చి పాత కుట్రలే..**

ఏపీ ప్రభుత్వం తొలుత 'పోలవరంబనకచర్ల' పేరుతో ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిందని, అయితే తెలంగాణ అభ్యంతరాలతో కేంద్ర జల సంఘం ఆ డీపీఆర్‌ను వెనక్కి పంపిందని ప్రభుత్వం గుర్తు చేస్తోంది. ఇప్పుడు ఏపీ సర్కారు కేవలం పేరు మార్చి 'పోలవరంనల్లమల సాగర్' పేరుతో కొత్త ప్రతిపాదనను తెరమీదకు తెచ్చిందని, ఇది కూడా చట్టవిరుద్ధమేనని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణకు దక్కాల్సిన సాగునీటి వాటాకు తీవ్ర గండి పడుతుందని, ట్రిబ్యునల్‌లో విచారణ జరుగుతుండగానే డీపీఆర్ సిద్ధం చేయడం నిబంధనల ఉల్లంఘన కిందకే వస్తుందని తెలంగాణ వాదిస్తోంది. మిగతా 2లో..

### సీజేఐ బెంచ్ ముందు కీలక విచారణ

ఈ పిటిషన్ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మలా బాగ్చి నేతృత్వంలోని బెంచ్ ముందు విచారణకు రానుంది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తరపున ప్రముఖ సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ తన వాదనలను వినిపించనున్నారు. పిటిషన్ విచారణకు వస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదివారం ముంబైలో సింఘ్వీతో పాటు జలవనరుల నిపుణులు, సీనియర్ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణకు జరిగే నష్టాలను, ఏపీ ప్రభుత్వం చేస్తున్న చట్టపరమైన ఉల్లంఘనలను కోర్టు ముందు బలంగా ఉంచాలని సీఎం దిశానిర్దేశం చేశారు.



## ఎంజీనరేగా బచావో సంగ్రాం కమిటీలో సీతక్క

ఢిల్లీ, స్నేహిత ఎక్స్ ప్రెస్: కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన వీబీ-జీరాంజీ చట్టాన్ని రద్దుచేసి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలన్న డిమాండ్‌తో కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమైందిజ. ఈ నేపథ్యంలో ఈనెల 10 నుంచి ఫిబ్రవరి 25వరకు దేశవ్యాప్తంగా 'ఎంజీనరేగా బచావో సంగ్రాం' ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టనుంది. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ఏఐసీసీ అధిష్ఠానం 9 మంది సభ్యులతో జాతీయస్థాయిలో సమన్వయ కమిటీని ఏర్పాటుచేసింది. సీనియర్ నేత అజయ్ మాకెన్ సమన్వయకర్తగా వ్యవహరించే ఈ కమిటీలో సభ్యురాలిగా తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క నియమితులయ్యారు. మాజీ కేంద్రమంత్రి జైరాంరమేష్, మాజీ ఎంపీలు సందీప్ దీక్షిత్, ఉదిత్‌రాజ్, కర్ణాటకమంత్రి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే కుమారుడు ప్రియాంక్‌ఖర్గే, ఝార్ఖండ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి దీపికా పాండేసింగ్, రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ ఛైర్‌పర్సన్ సునీల్‌పన్వర్, యూత్‌కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మనీష్‌శర్మలు ఇందులో సభ్యులుగా నియమితులయ్యారు.

# సొంత గడ్డకే రేవంత్ ద్రోహం!

- కొడంగల్ ప్రజలకు ముఖ్యమంత్రి వెన్నుపోటు
- సొంత గడ్డకే ముఖ్యమంత్రి తీరని ద్రోహం చేసిన సీం
- గ్రావిటీని కాదని రైతుల నోట్లో మట్టి కొడుతున్న రేవంత్ రెడ్డి
- పాలమూరుపై పగ.. కాళేశ్వరంపై తెలంగాణ ముఖ్యమంత్రి కక్ష
- గ్రావిటీని కాదని రైతుల నోట్లో మట్టి కొడుతున్న రేవంత్ రెడ్డి
- సీఆర్ నిర్మించిన ప్రాజెక్టులను పండబెట్టి రైతాంగంపై కక్షసాధింపు!
- తెలంగాణకు నాడు-నేడు నెంబర్ వన్ విలన్ కాంగ్రెస్ పార్టీయే
- మీ ప్రాధాన్యత ప్రజల మేలా.. లేక కమీషన్ల కాసులా?
- బీమాను ఆగం చేసే కుట్ర.. ఒక టీఎంసీకి 15 వేల ఎకరాలంటావా?
- పవర్ పాయింట్ ప్రజంటేషన్ లో హరీశ్ రావు సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్, స్నేహిత ఎక్స్ ప్రెస్:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ ప్రజలకు కూడా ద్రోహం చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. తనకు ఓట్లేసి గెలిపించిన ప్రజలను కూడా ఆయన దగా చేస్తున్నారని మండిపడ్డారు. సాగునీటి ప్రాజెక్టులపై ఆదివారం తెలంగాణ భవన్‌లో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తూ హరీశ్‌రావు ఈ విమర్శలు గుప్పించారు. "రేవంత్ రెడ్డీ నీ ప్రాధాన్యత ఏంది..? ప్రజల మేలా.. లేదంటే కమీషన్‌ల కక్కుర్తా..?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు.

**ఏమన్నా అయ్యే పనేనా..**

కొడంగల్‌నారాయణపేట్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు రూ.4,350 కోట్లు ఖర్చు పెట్టి లక్ష ఎకరాలకు నీళ్లు ఇస్తామని ప్రభుత్వం చెబుతోందని, అయితే ఈ లిఫ్టును బీమాలో పెడుతున్నారని హరీశ్ రావు ఆక్షేపించారు. ఇప్పటికే బీమాలోని 20 టీఎంసీల నీటితో 2.10 లక్షల ఎకరాలకు నీళ్లు సరిపోవడం లేదని, ఇప్పుడు మళ్లీ అందులో నుంచే ఏడు టీఎంసీల నీటిని తోడుతాననడం ఏమన్నా అయ్యే పనేనా అని నిలదీశారు. అట్లా చేస్తే అటు బీమా ఆగం, ఇటు కొడంగల్ ఆగమైతాయని హెచ్చరించారు. బీమా ప్రాజెక్టులోని 20 టీఎంసీల నీటితో ఒక టీఎంసీకి 10 వేల ఎకరాల చొప్పున 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని తాము అంటుంటే, రేవంత్ రెడ్డి మాత్రం ఒక టీఎంసీతో 15 వేల ఎకరాలకు నీళ్లు పారుతాయని అంటున్నారని, బుర్ర ఉన్నోడు ఎవడన్నా ఇట్లా మాట్లాడుతాడా అని ఎద్దేవా చేశారు. రేపు బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ముందు ఇదే వాదన వినిపిస్తే తెలంగాణకు రావాల్సిన నీటి వాటా తగ్గిపోదా అని ప్రశ్నించారు.

**16 వేల ఎకరాలకే నీళ్లు ఇస్తారట..**

కాలువ తవ్వితే పాలమూరు నుంచి కరివెన రిజర్వాయర్ ద్వారా మక్తల్‌లో 66,963 ఎకరాలకు సాగునీరు అందుతుందని, కానీ కాలువ తవ్వకుండా లిఫ్టు పెడుతున్నారని హరీశ్ రావు ఆరోపించారు. మరి లిఫ్టు ద్వారా ఇచ్చే సాగునీరు కేవలం 30 వేల ఎకరాలేనని, ఎందుకు లిఫ్టులు, పంపులు, కరెంటు బిల్లుల ఖర్చు అని నిలదీశారు. నారాయణపేటకు కూడా పాలమూరు నుంచి కాలువ తవ్వితే గ్రావిటీ ద్వారా 1.10 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉన్నా, లిఫ్టు పెట్టి 16 వేల ఎకరాలకే నీళ్లు ఇస్తారట అని విమర్శించారు. ఇక కాలువ తవ్వితే గ్రావిటీ ద్వారా పాలమూరు నుంచి కొడంగల్‌కు 63 వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉండగా, కాలువ తవ్వకుండా లిఫ్టు పెట్టి 53 వేల ఎకరాలకు నీళ్లు ఇస్తాననడం కొడంగల్ ప్రజలను దగా చేయడం కాదా అని మండిపడ్డారు. అది కూడా మూడో లిఫ్టు ద్వారా ఇస్తాననడం తనను గెలిపించిన కొడంగల్ ప్రజలకు రేవంత్ రెడ్డి చేస్తున్న ద్రోహం అని దుయ్యబట్టారు.

**నీకు కమీషన్లు రావడమా..?**

కొడంగల్‌నారాయణపేట లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కోసం ఈ సర్కారు చేస్తున్న రూ.4,350 కోట్ల ఖర్చుతో పాలమూరు ప్రాజెక్టు కాలువలు అన్నీ పూర్తయితాయని హరీశ్ రావు సూచించారు. లిఫ్టుల కంటే ఎక్కువ భూమి సాగు అవుతుందని, మరి లిఫ్టులు ఎందుకని ప్రశ్నించారు. "మీ ప్రాధాన్యత ఏంది..? ప్రజలకే రావడమా.. లేదంటే నీకు కమీషన్లు రావడమా..? పాలమూరు బిడ్డను అంటావు, పాలమూరుకు ద్రోహం చేస్తావు. ఏండ్లుగా కాంగ్రెస్, టీడీపీ పాలమూరుకు చేసిన ద్రోహాలను నువ్వు కొనసాగిస్తున్నావు" అని నిప్పులు చెరిగారు. కేసీఆర్ పదేళ్లపాటు అపరభగీరథుడిలా కష్టపడి నిర్మించిన ప్రాజెక్టులను ఇప్పుడు ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తున్నారని, కాళేశ్వరంపై కక్ష గట్టి, పాలమూరుపై పగబట్టారని విమర్శించారు. రిటైర్డ్ సీడబ్ల్యూసీ చీఫ్ ఇంజనీర్ విద్యాసాగర్ రావు వంటి నిపుణుల సలహాలతో రూపకల్పన చేసిన ప్రాజెక్టులను మేడిగడ్డ వద్ద రెండు పిల్లర్లు కుంగిపోతే మొత్తం కాళేశ్వరాన్నే పండబెట్టారని ఆరోపించారు.

**రెండేళ్లలో రెండు రూపాయలు కూడా ఇవ్వలే..**

వంద, రెండు వందల కోట్లు ఖర్చు పెడితే ఐదారు లక్షల ఎకరాలకు నీళ్లు వచ్చే అవకాశం ఉన్నా, ఈ రెండేళ్లలో రెండు రూపాయలు కూడా ఇవ్వలేదని హరీశ్ రావు విమర్శించారు. రైతాంగం మీద, ఉత్తర తెలంగాణ మీద రేవంత్ పగబట్టారని, మేడిగడ్డ బ్యారేజీ లేకపోయినా నదీ ప్రవాహం నుంచి కన్నెపల్లి పంప్‌హౌస్‌ను నడిపి నీళ్లిచ్చే అవకాశం ఉన్నా కావాలనే పండబెడుతున్నారని మండిపడ్డారు. శ్రీశైలం దన్నుతో మన రాష్ట్రానికి మేలు జరుగుతుందని కేసీఆర్ పాలమూరు ప్రాజెక్టును కడితే, రెండేళ్ల నుంచి పట్టించుకోవడం లేదని, ప్యాకేజీ 3 కింద ఉన్న కాలువను పూర్తి చేస్తే 50 టీఎంసీల నీళ్లు నిలుపుకునే అవకాశం ఉన్నా ఆ అవకాశాన్ని కాలరాశారని ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రాంతానికి మిగతా 2లో..

## ఏపీ నీటి హక్కులపై రేవంత్‌బాబు ఒప్పందం?

- రేవంత్ వర్సెస్ ఏపీ సర్కార్ మధ్య వార్!
- నేను కోరాను.. చంద్రబాబు ఆపేశారు
- అసెంబ్లీలో రేవంత్ చేసిన వ్యాఖ్యలతో ఏపీలో ప్రకంపనలు
- 2020లోనే ఎన్‌జీటీ పనులు నిలిపివేసిందన్న ఏపీ ప్రభుత్వం
- బాబు రహస్య ఒప్పందం బయటపడింది.. వైసీపీ ధ్వజం
- రాజకీయ ప్రయోజనాల కోసం అసత్యాలు ప్రచారం చేయొద్దన్న ఏపీ సర్కార్
- చంద్రబాబుపై రేవంత్ చేసిన వ్యాఖ్యలు అసంబద్ధమని కొట్టిపారేసిన ఏపీ సర్కార్.
- రేవంత్ రెడ్డి వ్యాఖ్యలే సాక్ష్యంగా బాబుపై విరుచుకుపడుతున్న వైఎస్సార్ కాంగ్రెస్



హైదరాబాద్, స్నేహిత ఎక్స్ ప్రెస్:

తెలంగాణ అసెంబ్లీ వేదికగా కృష్ణా జలాలపై జరిగిన చర్చ ఇప్పుడు రెండు రాష్ట్రాల మధ్య రాజకీయ దుమారాన్ని రేపుతోంది. ముఖ్యంగా రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను తన విజ్ఞప్తి మేరకే ఏపీ సీఎం మిగతా 2లో..



## కృష్ణా నీటి వాటా సాకు?

- కవిత వ్యాఖ్యల వెనుక ఆ 'నలుగురు'?
- తెలంగాణ ప్రయోజనాలను కర్ణాటకకు తాకట్టు పెడతారా?
- ప్రతిపక్షం లేని సమయంలో కాంగ్రెస్ ఆడుతున్న డ్రామాలు
- ప్రజాక్షేత్రంలో వారి అసలు రంగును బయటపెట్టాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం
- కృష్ణా ప్రాజెక్టులపై రేవంత్ సర్కార్‌కు కవిత సూటి ప్రశ్నలు

02

# మేడారం మహాజాతరకు సర్వం సిద్ధం!

- 20న అమ్మవార్ల గద్దెల ప్రాంగణం ప్రారంభం
- ఈ నెల 28 నుంచి 31 వరకు జరగనున్న మహాజాతర
- పునర్నిర్మించిన గద్దెల ప్రాంగణాన్ని ఈ నెల 20న ప్రారంభించనున్న సీఎం
- రాతి కట్టడాలతో శాశ్వత అభివృద్ధి పనులు.. నాణ్యతా ప్రమాణాలపై మంత్రి పొంగులేటి
- జంపన్న వాగు వద్ద స్నాన ఘట్టాలు, విశాలమైన రహదారులు, సెంట్రల్ లైటింగ్‌తో సరికొత్త హంగులు



02

# మేడారం మహాజాతరకు సర్వం సిద్ధం!

**వరంగల్, స్నేహిత ఎక్స్ ప్రెస్:**



ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం సమ్మక్కసారలమ్మ మహాజాతర పునర్నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. కోట్లాది మంది భక్తుల ఆరాధ్య దైవాలైన అమ్మవార్ల గద్దెల ప్రాంగణాన్ని ఈ నెల 20వ తేదీలోపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. ఖమ్మం పర్యటన అనంతరం మంత్రి సీతక్క, ఎంపీ బలరాం నాయక్, జిల్లా అధికారులతో కలిసి ఆయన మేడారంలో జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్న మంత్రి, జాతర ఏర్పాట్ల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరగనున్న మేడారం మహాజాతర కోసం ప్రజా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తోంది. ముఖ్యంగా రాతి కట్టడాలతో చేపట్టిన శాశ్వత అభివృద్ధి పనులు వందల ఏళ్ల పాటు చెక్కుచెదరకుండా ఉండేలా నాణ్యతా ప్రమాణాలతో నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు. సమయం తక్కువగా ఉన్నప్పటికీ, అంకుటిత దీక్షతో ఈ పనులను పూర్తి చేస్తున్నామని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ మహాత్కార్యంలో భాగస్వామిని కావడం ఆ అమ్మవార్ల దయ, తన అదృష్టంగా భావిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. స్థానిక మంత్రి సీతక్క ప్రతిరోజూ పనులను పర్యవేక్షిస్తూ యంత్రాంగాన్ని పరుగులు పెట్టిస్తున్నారని కొనియాడారు. భక్తుల సౌకర్యార్థం జాతర ప్రాంగణంలో అత్యాధునిక వసతులను కల్పిస్తున్నారు. గిరిజన ఆచార వ్యవహారాలకు భంగం కలగకుండా ప్రాంగణ ఆధునీకరణ, ప్రధాన ఆర్చి నిర్మాణం, జంపన్న వాగు వద్ద స్నాన ఘట్టాలు, నిరంతర నీటి సరఫరా వంటి పనులు పూర్తయ్యాయి. మేడారానికి వచ్చే అన్ని రహదారులను విశాలంగా తీర్చిద్దడంతో పాటు సెంట్రల్ లైటింగ్, పచ్చదనం, ఆదివాసీ సంస్కృతిని ప్రతిబింబించే సుందర శిల్పాలతో కూడళ్లను ఆధునీకరించారు. ఆధునీకరణ నేపథ్యంలో ఈసారి దేశం నలుమూలల నుంచి భక్తుల తాకిడి భారీగా ఉండే అవకాశం ఉన్నందున, ఎక్కడా చిన్నపాటి లోటుపాట్లు కూడా లేకుండా మౌలిక వసతులు కల్పిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. చరిత్రలో నిలిచిపోయేలా ఈ మహాజాతరను నిర్వహించేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేస్తోందని తెలిపారు.

# కృష్ణా నీటి వాటా సాకు?

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్ ప్రెస్:**

బీఆర్‌ఎస్ పార్టీలో కేసీఆర్ తర్వాత ఎవరిది పైచేయి అనే వారసత్వ పోరు చాలా కాలంగా అంతర్గతంగా సాగుతోంది. అసెంబ్లీలో రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని హరీశ్ రావు సమర్థవంతంగా ఢీకొంటుండటం, పార్టీ క్యాడర్‌లో ఆయన గ్రాఫ్ పెరగడం కేటీఆర్, కవితలకు కొంత ఆందోళన కలిగించే అంశంగా మారింది. హరీశ్ రావుకు పార్టీలో ప్రాధాన్యత పెరిగితే, భవిష్యత్తులో కేటీఆర్ నాయకత్వానికి ఇబ్బందులు ఎదురవుతాయని భావించే ఒక వర్గం మద్దతుతోనే కవిత ఇంత ఘాటుగా విమర్శలు చేశారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కవిత ఇంత బహిరంగంగా విమర్శలు చేయడం వెనుక కేటీఆర్ మౌన ప్రోత్సాహం ఉందనే చర్చ పార్టీ వర్గాల్లో నడుస్తోంది. హరీశ్ రావు సొంతంగా ఒక "గుంపు"ను తయారు చేసుకుంటున్నారని కవిత అనడం ద్వారా, ఆయన పార్టీలో చీలిక తెచ్చే ప్రయత్నం చేస్తున్నారనే ముద్ర వేయాలని చూస్తున్నారు. తన సోదరుడు కేటీఆర్‌ను పార్టీకి ఏకైక వారసుడిగా నిలబెట్టే క్రమంలో, హరీశ్ రావు ఇమేజ్‌ను దెబ్బతీయడానికి కవితను ముందువరుసలో ఉంచినట్లు కనిపిస్తోంది.



నీటి పారుదల ప్రాజెక్టులలో హరీశ్ రావు తీసుకున్న నిర్ణయాల వల్ల తెలంగాణకు నష్టం జరిగిందని ఆరోపించడం వెనుక నైతిక దెబ్బ కొట్టాలనే వ్యూహం ఉంది. హరీశ్ రావు పట్ల సానుభూతి ఉన్న ప్రజల్లో మరియు క్యాడర్‌లో ఆయనపై అనుమానాలు రేకెత్తించడం ద్వారా ఆయన బలాన్ని తగ్గించవచ్చని కవిత భావిస్తున్నారు. ముఖ్యంగా సాగునీటి విషయంలో హరీశ్ రావు సంతకం పెట్టారని చెప్పడం ద్వారా, తెలంగాణ ప్రయోజనాల విషయంలో ఆయన రాజీ పడ్డారనే సంకేతాన్ని పంపడం ఈ వ్యూహంలో భాగం. మొత్తానికి, కవిత వ్యాఖ్యలు బీఆర్‌ఎస్ పార్టీలో అంతర్గత వర్గపోరును రోడ్డుపైకి తెచ్చాయి. ఢిల్లీ లిక్కర్ కేసు తర్వాత రాజకీయంగా తన ఉనికిని చాటుకోవాలని చూస్తున్న కవిత, అదే సమయంలో హరీశ్ రావు దూకుడుకు బ్రేకులు వేయాలని ప్రయత్నిస్తున్నారు. పార్టీ అధినేత కేసీఆర్ ఈ గొడవపై స్పందించకపోవడం చూస్తుంటే, కుటుంబం లోపల అధికార పంపిణీ విషయంలో తీవ్రమైన సంఘర్షణ జరుగుతోందని, ఇందులో కవితకు ఒక పక్కా ప్లాన్ ప్రకారం మద్దతు అందుతోందని స్పష్టమవుతోంది.

# సొంత గడ్డకే రేవంత్ ద్రోహం!

( మొదటిపేజీ తరువాయి )

కాంగ్రెస్ పార్టీ చేసిన ద్రోహం అంతా ఇంతా కాదని, మన ప్రాంతాన్ని ఆంధ్రాతో కలిపి, మన విద్యార్థులను పొట్టన పెట్టుకుని, మన ప్రాజెక్టులను రద్దు చేసిందే కాంగ్రెస్ అని దుయ్యబట్టారు.

**నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు అన్యాయం..**

తెలంగాణ ప్రాంతాన్ని ఆంధ్రాతో కలుపడం ఒక తప్పయితే, కలిపిన తర్వాత ఫజల్ అలీ కమిషన్ సూచనలకు భిన్నంగా ఈ ప్రాంతానికి మేలు చేసే ప్రాజెక్టులను రద్దు చేసి మరణశాసనం రాయడం మరో తప్పని హరీశ్ రావు పేర్కొన్నారు. ఏలేశ్వరం దగ్గర కట్టాల్సిన నాగార్జునసాగర్ ప్రాజెక్టును నందికొండకు మార్చి నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు అన్యాయం చేసింది కాంగ్రెస్ పార్టీయేనని గుర్తు చేశారు. 600 కిలోమీటర్ల గోదావరి, 300 కిలోమీటర్ల కృష్ణానది ప్రవహిస్తున్నా ఈ ప్రాంతంలో నీటి కోసం గోసపడే పరిస్థితి వచ్చిందంటే అందుకు కారణం 60 ఏండ్లకు పైగా పాలించిన కాంగ్రెస్, టీడీపీలేనని ఆరోపించారు. గోదావరిలో మన పరివాహక ప్రాంతం 79 శాతం ఉంటే మనకు దక్కింది 15 శాతమేనని, కృష్ణానదిలో మన పరీవాహక ప్రాంతం 69 శాతం ఉంటే దక్కింది 34 శాతమేనని గణాంకాలు వివరించారు. రాష్ట్ర విభజన సమయంలో సెక్షన్ 84 పెట్టి అన్యాయం చేసిందే కాంగ్రెస్ అని, సోనియాగాంధీ రక్షణలు కల్పించిందని రేవంత్ రెడ్డి చెప్పడం అబద్ధమని కొట్టిపారేశారు.

**నెంబర్ వన్ విలన్ కాంగ్రెస్..**

పాలమూరురంగారెడ్డి పథకానికి 11వ షెడ్యూల్లో సోనియా గాంధీ రక్షణలు కల్పించలేదని హరీశ్ రావు స్పష్టం చేశారు. అందులో పెట్టినవి కేవలం హంద్రీనీవా, తెలుగుగంగ, గాలేరు నగరి, వెలిగొండ, కల్వకుర్తి, నెట్టెంపాడు మాత్రమేనని, తెలంగాణవి రెండే ఉన్నాయని చెప్పారు. పాలమూరు, దిండి ఎత్తిపోతల పథకాలు అందులో లేవని, ఉండి ఉంటే మనకు అనుమతులు వచ్చేవి కదా అని ప్రశ్నించారు. "తెలంగాణ ప్రాంతానికి నాడైనా, నేడైనా నెంబర్ వన్ విలన్ కాంగ్రెస్ పార్టీ" అని కేసీఆర్ చెప్పిన మాటలు అక్షర సత్యమని తేలిపోయిందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే కృష్ణా ప్రాజెక్టును కేఆర్ఎంబీకి అప్పజెప్తామనడం, గోదావరిబనకచర్ల ప్రాజెక్టుపై లోపాయికారి ఒప్పందాలు చేసుకోవడం ద్వారా తెలంగాణకు ద్రోహం చేస్తున్నారని హరీశ్‌రావు తన ప్రసంగాన్ని ముగించారు.



## ఏపీ ప్రాజెక్టుకు బ్రేక్ వేయడమే లక్ష్యం!

( మొదటిపేజీ తరువాయి )

తక్షణమే పనులను నిలిపివేయాలి ఎలాంటి చట్టబద్ధమైన అనుమతులు లేకుండానే పోలవరం నుంచి నల్లమలసాగర్‌కు గోదావరి నీటిని లింక్ చేసే విస్తరణ పనులను వెంటనే నిలిపివేయాలని తెలంగాణ ప్రధానంగా డిమాండ్ చేస్తోంది. పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఈ అక్రమ పనులను ఆపివేసేలా సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలివ్వాలని విన్నవించింది. కేంద్ర ప్రభుత్వం కూడా తెలంగాణ అభ్యంతరాలను పట్టించుకోకుండా ఈ ప్రాజెక్టు ప్రీఫీజిబిలిటీ రిపోర్టులను పరిశీలించడం సమంజసం కాదని పేర్కొంది. నిబంధనలను ఉల్లంఘించి కడుతున్న ఈ ప్రాజెక్టుకు కేంద్రం ఎలాంటి ఆర్థిక సాయం అందించకూడదని, పర్యావరణ అనుమతులు కూడా ఇవ్వకూడదని సుప్రీంకోర్టును తెలంగాణ కోరింది.



## ఏపీ నీటి హక్కులపై రేవంత్‌బాబు ఒప్పందం?

( మొదటిపేజీ తరువాయి )

చంద్రబాబు ఆపేశారన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు వాస్తవ విరుద్ధమని, రాజకీయ లబ్ధి కోసమే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఏపీ ప్రభుత్వం అధికారిక ప్రకటనలో ఖండించింది.

**ఏపీ ప్రభుత్వ వివరణ..**

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ఆగడానికి రేవంత్ రెడ్డి ఒత్తిడి కారణం కాదని ఏపీ సర్కార్ స్పష్టం చేసింది. గత జగన్ ప్రభుత్వ హయాంలో ఎలాంటి అనుమతులు లేకుండానే రోజుకు 3 టీఎంసీల తరలింపు లక్ష్యంగా పనులు ప్రారంభించారని, దీనిపై తెలంగాణ ప్రభుత్వం కోర్టులు, ఎన్‌జీటీని ఆశ్రయించిందని గుర్తు చేసింది. ఈ ఫిర్యాదులను విచారించిన నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (NGT) మరియు కేంద్ర ప్రభుత్వం.. అనుమతులు లేనందున 2020లోనే పనులను నిలిపివేయాలని ఆదేశించాయని పేర్కొంది. అంటే 2024లో కూటమి ప్రభుత్వం రాకముందే, కేంద్రమే ఈ పనులను నిలిపివేసిందని ఏపీ ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది.

**చంద్రబాబుపై వైసీపీ ఎదురుదాడి..**

మరోవైపు రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను అస్త్రంగా చేసుకుని వైసీపీ కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడుతోంది. "తాను కోరినందునే చంద్రబాబు పనులు ఆపేశారు" అని రేవంత్ అసెంబ్లీలో చెప్పడం ద్వారా చంద్రబాబురేవంత్ మధ్య ఉన్న రహస్య ఒప్పందం బహిర్గతమైందని వైసీపీ ఆరోపిస్తోంది. రాయలసీమ ప్రాంతాన్ని ఎడారిగా మార్చేందుకు చంద్రబాబు సిద్ధమయ్యారని, తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం సీమ ప్రాజెక్టును బలిపెట్టారని విమర్శించింది. రాయలసీమకు జీవనాడి లాంటి ఈ ప్రాజెక్టును ఆపడం ద్వారా బాబు ఆ ప్రాంత ప్రజలకు వెన్నుపోటు పొడిచారని వైసీపీ నేతలు మండిపడుతున్నారు.



**నీటి హక్కులపై రాజీ లేదు..**

తెలంగాణలో అధికార, ప్రతిపక్ష పార్టీలు తమ రాజకీయాల కోసం చంద్రబాబును కేంద్రంగా చేసుకుని నాటకాలు ఆడుతున్నాయని ఏపీ ప్రభుత్వం ఎద్దేవా చేసింది. ఏపీ నీటి హక్కుల విషయంలో గానీ, రాయలసీమ సాగునీటి ప్రయోజనాల విషయంలో గానీ తమ ప్రభుత్వం ఏ మాత్రం వెనక్కి తగ్గేది లేదని, అన్ని చట్టపరమైన అనుమతులు సాధించి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేసింది. ఈ వివాదం ఇప్పుడు రెండు రాష్ట్రాల మధ్య జల జగడంగానే కాకుండా, అంతర్గత రాజకీయ పోరాటంగా కూడా మారుతోంది.

## యాదగిరిగుట్టలో ముగిసిన అధ్యయనోత్సవాలు

**చివరిరోజు స్వయంభు రూపంలో స్వామివారి దర్శనం**

**యాదగిరిగుట్ట, స్నేహిత ఎక్స్ ప్రెస్:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక అధ్యయనోత్సవాలు ముగిశాయి. ఈ నెల 30 నుంచి ఆరురోజులపాటు ఉత్సవాలు వైభవంగా సాగాయి. ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు ఆదివారం ఆలయ అర్చకులు శ్రీలక్ష్మి సమేత నరసింహస్వామిని స్వయంభు రూపంలో అలంకరించి తిరువీధి సేవోత్సవం నిర్వహించారు. ఈ విశిష్ట పర్వంతో అధ్యయనోత్సవాలు ముగిశాయి. సోమవారం నుంచి స్వామివారి నిత్య కల్యాణం మొదలుకానుంది. ఉదయం ఆలయంలో నిత్యారాధనల అనంతరం అధ్యనోత్సవాల్లో భాగంగా పారాయణీకులు దివ్య ప్రబంధ పారాయణం నిర్వహించారు. అనంతరం స్వామివారిని శ్రీలక్ష్మీ నరసింహస్వామిగా (స్వయంభు రూపం) అలంకరించి భక్తుల దర్శనార్థం ఆలయ తిరువీధుల్లో ఊరేగించారు.అనంతరం ఆలయంలో ఉత్సవమూర్తులకు తిరుమంజనం, నవకలశ స్నపనమహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు.



# రిటైర్డ్ ఉద్యోగుల ఆక్రందన

**రేవంత్ సర్కార్ నిర్లక్ష్యంపై శాసనమండలి విప్ దేశపతి శ్రీనివాస్ మండిపాటు.**

**సిద్దిపేట , స్నేహిత ఎక్స్ ప్రెస్:**

తెలంగాణ ఉద్యమంలోనూ, రాష్ట్ర నిర్మాణంలోనూ వెన్నెముకగా నిలిచిన ప్రభుత్వ ఉద్యోగులను, పదవీ విరమణ అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం పాతాళానికి నెట్టేస్తోందని శాసనమండలి విప్ మరియు ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ధ్వజమెత్తారు. ఆదివారం నాడు విడుదల చేసిన ఒక ప్రకటనలో, రిటైర్డ్ ఉద్యోగుల పెన్షనరీ బకాయిల చెల్లింపులో జరుగుతున్న జాప్యంపై ఆయన తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. "ఒక ఉద్యోగి తన 3540 ఏళ్ల జీవితాన్ని సమాజ సేవకు అంకితం చేసి, రిటైర్మెంట్ రోజున ప్రశాంతంగా ఇంటికి వెళ్లాల్సింది పోయి.. అప్పుల వాళ్లకు భయపడి అర్ధరాత్రి ఇల్లు వదిలి పారిపోయే దుస్థితిని ఈ ప్రభుత్వం కల్పించింది. ఇది ప్రజా పాలన కాదు, పేదల కన్నీళ్లు తుడవలేని కర్కోటక పాలన" అని ఆయన విమర్శించారు. పెన్షనరీ బకాయిలు అందక, ఆర్థిక ఇబ్బందులు మరియు మానసిక వేదనతో రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 36 మంది పెన్షనర్లు మరణించడం అత్యంత దారుణం. ఇవి సహజ మరణాలు కావు, ప్రభుత్వమే చేస్తున్న 'చట్టబద్ధమైన హత్యలు'. ముఖ్యమంత్రి ఊరిలోనే విషాదం: స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రామానికి చెందిన కుడుముల కొండయ్య అనే పెన్షనర్, వైద్యం అందక, తన బకాయిలు ఇస్తే బతుకుతానని మీడియా సాక్షిగా వేడుకున్నా.. ప్రభుత్వం కనికరించకపోవడంతో ఆయన ప్రాణాలు విడిచారు. ఈ ఘటన రేవంత్ సర్కార్ కు మాయని మచ్చ. పోలీసు అధికారిగా పనిచేసిన బాలకిషన్ వంటి వారు తన బిడ్డ పెళ్లికి రావలసిన డబ్బులు అందక, కూతురు ఆత్మహత్యకు గురైతే, ఆ బాధతో హార్ట్ స్ట్రోక్ తో మరణించడం గుండెలను పిండేస్తోంది. అప్పుల బాధ భరించలేక నల్గొండలో సత్యనారాయణ వంటి ఉద్యోగులు ఇళ్లు వదిలి పారిపోతుంటే ప్రభుత్వం మొద్దునిద్ర పోతోంది. • GPF, TSGLI, GIS వంటివి ప్రభుత్వం ఇచ్చే దానాలు కావు, ఉద్యోగి తన జీతం నుండి దాచుకున్న సొంత సొమ్ము. ఆ సొమ్మును కూడా ప్రభుత్వం 'ఈకుబేర్' లో బందీ చేయడం దారుణం. 14 వేల మంది పెన్షనర్ల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోంది. • డిమాండ్లు : 1. కుహనా మేధావుల తప్పుడు లెక్కలను పక్కన పెట్టి, రిటైర్ అయిన 14 వేల మంది ఉద్యోగుల బకాయిలను (GPF, GIS, Leave Encashment, Gratuity) తక్షణమే ఏకమొత్తంగా చెల్లించాలి. 2.పెన్షనర్లు తమ పెన్షన్ నుండి తిరిగి చెల్లించే 'కమ్యూటేషన్' మొత్తాన్ని వెంటనే మంజూరు చేయాలి. ఎన్నికల హామీ మేరకు నగదు రహిత వైద్యం కోసం హెల్త్ కార్డులు జారీ చేసి, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స అందేలా చూడాలి. మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా: పెన్షన్ బకాయిలు అందక చనిపోయిన 36 మంది ఉద్యోగుల కుటుంబాలకు ప్రభుత్వం బహిరంగ క్షమాపణ చెప్పి, భారీ పరిహారం ప్రకటించాలి. 5.సీపీఎస్ రద్దు పీఆర్సీ అమలు: పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరు చేసి, కొత్త పీఆర్సీని తక్షణమే అమలు చేయాలి. ఇచ్చిన హామీ ప్రకారం ఓల్డ్ పెన్షన్ స్కీమ్ అమలు చేయాలి. "ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు అంటే కేవలం ఓటు బ్యాంకు కాదు, వారు ఈ రాష్ట్ర నిర్మితలు. వారి ఉసురు తగిలితే ఏ సామ్రాజ్యమైనా కూలిపోక తప్పదు. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే, పెన్షనర్ల పక్షాన బిఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున ఉద్యమిస్తుంది" అని దేశపతి శ్రీనివాస్ హెచ్చరించారు.



## బొగ్గు గని కార్మికుల హామీలపై సూటి ప్రశ్నలు



**హెచ్ఎంఎస్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ గోశిక అశోక్**

**రామగుండం , స్నేహిత ఎక్స్ ప్రెస్:**

సింగరేణి సంస్థలో రెండేళ్ల క్రితం డిసెంబర్ 22న జరిగిన గుర్తింపు సంఘాల ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలయ్యాయా అనే అంశంపై హెచ్ఎంఎస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ గోశిక అశోక్ తీవ్ర స్థాయిలో ప్రశ్నలు లేవనెత్తారు. ఏఐటీయూసీ, ఐఎన్టిఈసి యూనియన్లు గుర్తింపు సంఘాలుగా ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను రెండేళ్లు గడిచినా అమలు చేయలేదని ఆయన ఆరోపించారు. 11 డివిజన్ పరిధిలోని సింగరేణి గని కార్మికులందరికీ మన స్సాక్షిగా సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మైక్ పట్టుకుని గోశిక అశోక్ చేసిన ప్రసంగం కార్మిక వర్గంలో పెద్ద ఎత్తున స్పందన రేపింది. గుర్తింపు సంఘాల నాయకులు ఇచ్చిన ఎన్నికల హామీలపై సవాల్ విసురుతూ, కార్మికులకు ఏం సాధించారో ప్రజల ముందు చెప్పాలని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. రెండు సంవత్సరాలుగా యాజమాన్యంతో సంప్రదింపుల పేరుతో కాలం గడుపుతూ, సాయంత్రం అయ్యే సరికి పోరాటాల పేరుతో గొప్పలు చెప్పడం తప్ప కార్మికుల జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకురాలేదని విమర్శించారు. కొత్త బొగ్గు గనుల ప్రారంభం, సింగరేణికి బాకీ ఉన్న జెన్కో, ట్రాన్స్కో నిధుల వసూలు, ఎక్స్టర్నల్ మరియు డిపెండెంట్ ఉద్యోగాలు, పన్నుల మినహాయింపులు, సొంతింటి కల, వడ్డీ లేని రుణాలు, విజిలెన్స్ కేసుల పరిష్కారం, కార్మికులకు ఇష్టమైన ప్రాంతాల్లో వైద్య సదుపాయాలు, పిల్లల విద్యా భద్రత, పని స్థలాల మౌలిక వసతులు, ప్రమోషన్లలో జరుగుతున్న అన్యాయాలు, బొగ్గు బావుల ప్రైవేటీకరణ, కార్మిక కాలనీల్లో రోడ్లు మరియు తాగునీటి సమస్యలు వంటి అంశాల్లో గుర్తింపు సంఘాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆయన ఆరోపించారు.

సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో ఫోటోలు, ప్రకటనలతో కార్మికులను మభ్యపెట్టే ప్రయత్నాలు ఇక సాగవని గోశిక అశోక్ హెచ్చరించారు. ఎన్నికల ముందు సమావేశాలు పెట్టి, పత్రికల్లో ప్రకటనలు ఇచ్చి, గ్యారంటీలు ప్రకటించిన నాయకుల వైఖరి ఇప్పుడు పూర్తిగా బయటపడిందని అన్నారు. కార్మికులు, వారి కుటుంబాలు ఈ పరిస్థితిని గమనిస్తున్నాయని, రాబోయే గుర్తింపు సంఘాల ఎన్నికల్లో దీనికి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

కార్మికులను మోసగించి స్వలాభం చూసుకునే నాయకత్వానికి ఇక కాలం చెల్లిందని హెచ్ఎంఎస్ తరపున గోశిక అశోక్ పేర్కొన్నారు. 11 డివిజన్ పరిధిలో కార్మిక వర్గాన్ని చైతన్యపరుస్తూ, రాబోయే ఎన్నికల్లో మార్పు తప్పదని ఆయన స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఈ పరిణామాలు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్లో కార్మిక సంఘాల రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కిస్తున్నాయి.

## నూతన విద్యా విధానం–2020, వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లును వెంటనే రద్దు చేయాలి

**విద్యా కాషాయీకరణ ఆపి, విద్యార్థులకు శాస్త్రీయ విద్య అందించాలి**

**వికారాబాద్ , స్నేహిత ఎక్స్ ప్రెస్:** హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 3,4 తేదీల్లో జరుగుతున్న sfi జాతీయ స్థాయి సెమినార్, కన్వెన్షన్ లో ఎస్ ఎఫ్ ఐ జిల్లా నాయకులు పాల్గొన్నారు ఈ కన్వెన్షన్ కు దేశం లోని అన్ని రాష్ట్రాల నాయకులు పాల్గొన్నారని sfi వికారాబాద్ జిల్లా కార్యదర్శి అక్బర్ తెలిపారు. ముఖ్యముగా జాతీయ కన్వెన్షన్ ఉద్దేశం దేశంలో బీజేపీ ప్రభుత్వం సంస్కరణల పేరుతో విద్యను కషాయకరణ చేస్తూ పెట్టుబడిదారి ప్రైవేట్ వ్యక్తుల చేతిలో పెట్టే విధంగా నూతన చట్టాలు చేస్తుంది అని దేశంలో మతోన్మాద విధానం తీసుకొచ్చి రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా వ్యవస్థలను కూలదోసి ప్రజా స్వామ్య వ్యవస్థల పై దాడి చేస్తుందని దాంట్లో భాగంగానే 2020 నూతన విద్యా విధానం తీసుకొచ్చింది ఈ విద్యా విధానం వల్ల విద్యార్థులకు చిన్నపడి నుండే వృత్తివిద్యా అందిస్తామని చెబుతూనే వారు మధ్యలోనే చదువును ఆపేసే విధంగా విద్యా చట్టాన్ని మార్చారు ఈ నూతన విద్యా విధానం 2020 చట్టం ద్వారా బిజెపి ప్రభుత్వం విద్యను కషాయీకరణ చేస్తూ చరిత్రను వక్రీకరిస్తూ భగత్ సింగ్ లాంటి మహనీయుల జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాలను తొలగిస్తుంది, భారత స్వాతంత్ర ఉద్యమంలో ఎక్కడా లేని ఆర్ఎస్ఎస్ గురించి ఆర్ఎస్ఎస్ వారే దేశ ప్రేమికులుగా వారి వల్లే దేశానికి సాయంత్రం వచ్చినట్లుగా వారు చరిత్ర ను వక్రీకరిస్తున్నారు. అంతేకాకుండా ఇటీవల కాలంలో ఉన్నత విద్యను పేద ప్రజలకు దూరం చేసే విధంగా వికసిత భారత్ శిక్ష అధిష్టాన పేరుతో చట్టాన్ని చేసి యుజిసి ఐ సిటీని విలీనం చేస్తూ ఉన్నత విద్యకు నిధులు కొరత సృష్టించే విధంగా చట్టం చేసి యూనివర్సిటీలను బలహీనం చేసే ప్రయత్నం చేస్తుంది. ఈ చట్టాలతో కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్నీ నిర్వీర్యం చేస్తుంది ఈ చట్టాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని దేశంలో శాస్త్రీయ విద్య అందించాలని అప్పటి వరకు ఎస్ ఎఫ్ ఐ పోరాడుతుందని పేర్కొన్నారు. ఈ కన్వెన్షన్ కు జిల్లా అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు తేజ, సహాయ కార్యదర్శి అనిల్, జిల్లా కమిటీ సభ్యులు శివ, అమెర్, పవన్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తుల సహాయంతో స్లాబ్ నిర్మాణం

**ఆర్మూర్, స్నేహిత ఎక్స్ ప్రెస్:**

ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని అంకాపూర్ శివారు ప్రాంతంలో గల శ్రీ శ్రీ పెద్దమ్మ తల్లి నూతన దేవాలయ నిర్మాణంలో భాగంగా ఆదివారం రోజు ముదిరాజ్ సంఘం పెద్దలందరీ సమక్షంలో భక్తులు, చందాదారులు అందరి సహకారంతో ఆలయ పైభాగన స్లాబ్ నిర్మాణం చేశారు. ఈ నిర్మాణానికి తమ వంతుగా ఎంతో మంది భక్తులు ధన రూపేనా వస్తువు రూపంలో సమర్పించుకుంటున్నారు. అందరి సహకారంతోని ఈరోజు ఆలయం నిర్మాణం అంగరంగ వైభవంగా పనులు పూర్తవుతున్నాయనీ ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇంకా ఎవరైనా భక్తులు మీకు తోచిన విధంగా సహకరిస్తే ఆ పెద్దమ్మతల్లి ఆశీస్సులుమీ అందరి పైన ఉంటుందని కోరుకుంటున్నాం అన్నారు.




# మిషన్ భగీరథ అధికారులు ఉన్నట్లా లేనట్లా ?

- 6 నెలలుగా పైపు పగిలి లీకైన పట్టించుకునే నాథుడే కరువు
- నిర్లక్ష్యపు వైఖరికి మిషన్ భగీరథ అధికారులు నిదర్శనమా?
- ఎన్నిసార్లు గ్రామస్థులు విన్నవించిన పట్టించుకోరా ?
- సమస్యను పరిష్కరించి నీటి సరఫరాను సక్రమంగా కొనసాగించాలని గ్రామస్తుల డిమాండ్

**కోటగిరి, స్నేహిత ఎక్స్ ప్రెస్:**

రెండు పూటలు (ఫీలింగ్) ఇస్తున్నట్లు రికార్డులో రాస్తారటా..! ట్యాంకులో మాత్రం అర కోరగా శుద్ధ నీటిని నింపుతారటా.అసలు సప్లై చేస్తున్నారా ? లేక నిర్లక్షపు నీడన చేతులుదులుపుకుంటున్నారా ? రికార్డులు మెయింటెనెన్స్ చేయడంలో చూపిస్తున్న కుతూహలత క్షేత్రస్థాయిలో పనిచేయడంలో మిషన్ భగీరథ అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగ ఉంటున్నారనేది పెద్ద ప్రశ్నగా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు.పోతంగల్ మండలంలోని జల్లాపల్లి ఆబాది గ్రామ ప్రజలు గత 6 నెలలుగా అరకొర మిషన్ భగీరథ నీటితో అనేక ఇబ్బందులకు గురవుతున్నారు.ఈ






విషయమై సంబంధిత సిబ్బందికి పలుమార్లు విన్నవించిన వారి నుండి వచ్చిన సమాధానం పై నుండి నీరు వస్తలేదు! వచ్చినప్పుడు ఇస్తాం ! వచ్చిన కాడికి ఇస్తున్నాం అని నిర్లక్ష్యపు సమాధానం చెప్తున్నారని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.పైప్ లైన్ చాంబర్లు కూడా శుభ్రత లోపించి అపశుభ్రంగా కనిపిస్తూ దుర్గంధం వెదజల్లుతుందని ప్రజలు వాపోతున్నారు.సంబంధిత కంపెనీ వారు రికార్డులను సక్రమంగా రాసుకుంటున్నారె కానీ క్షేత్ర స్థాయిలో పనీతీరును మాత్రం పక్కన పెడుతున్నారనీ ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు.పోతంగల్ మండలంలోని జల్లాపల్లి గ్రామానికి వచ్చే జల్లపల్లి రోడ్డులోనీ మిషన్ భగీరథ పైప్ లైన్ పగిలి శుద్ధ నీరు పంట పొలాల్లోకి గత ఆరు నెలలుగా ప్రతి రోజు కొన్ని వందల లీటర్ల నీరు వృధాగా పోతుందినీ. ఈ విషయాలు గుర్తెరుగని గ్రామస్తులు, ఎందుకు నీరు తక్కువగా వస్తుందని పలుమార్లు సంబంధిత సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లగా వారు పొంతన లేని సమాధానాలు చెప్పారనీ ప్రజలు అసహనం వ్యక్తం చేశారు.గత వారం రోజులుగా గ్రామస్తులే పలానా ప్రాంతంలో పైపు లీకేజీ అయిందన్న విషయం అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన సమస్యను పరిష్కరించే నాథుడే కరువయ్యాడు.ఇటీవల ఏర్పడ్డ నూతన గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు పలుమార్లు సమస్యను సంబంధిత అధికారులకు విన్నవించిన.పరిష్కారంలో ఫలితం శూన్యం.గతంలో గ్రామంలోనీ 40 కేఎల్,20 కేఎల్ ట్యాంకులను రెండు ఫీలింగ్ల పాటు నింపేవారనీ. కానీ గత ఆరు నెలలుగా గ్రామంలో 40 కేఎల్ ట్యాంక్ నే సగానికి నింపుతున్నారనీ.దీంతో గ్రామంలో తీవ్ర శుద్ధ నీటి కొరత ఏర్పడిందనీ ప్రజలు ఆగ్రహానికి వ్యక్తం చేస్తున్నారు. రికార్డులలో రాసే లెక్కలపై చూపిన శ్రద్ధ క్షేత్ర స్థాయిలో ఉన్న లోపాలపై అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ఇకనైనా అధికారులు తమ నిర్లక్ష్య వైఖరిని వీడి మిషన్ పైపు లీకేజీ లను వెంటనే మరమ్మత్తులు చేసి,నీటి వృధాను అరికట్టి,గ్రామానికి సక్రమంగా తాగునీరును అందించాలని ప్రజలు కోరుతున్నారు.

## ఘనంగా రషీద్ పాషా జన్మదిన వేడుకలు



**చౌడాపూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** చౌడాపూర్ మండల కాంగ్రేస్ పార్టీ మైనారిటీ మండల అధ్యక్షులు రషీద్ పాషా జన్మదినాన్ని పురస్కరించుకొని జన్మదిన వేడుకలు కాంగ్రేస్ పార్టీ శ్రేణుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. నాయకులు మిత్రులు కలిసి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కాంగ్రేస్ పార్టీ మండల అధ్యక్షుడు అశోక్ కుమార్ మాట్లాడుతూ..ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని మరెన్నో ఉత్తమ పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రేస్ పార్టీ నాయకులు,యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పరిగి మాజీ ఎమ్మెల్యే సమక్షంలో ముబీన్ జన్మదిన వేడుకలు




**చౌడాపూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** చౌడాపూర్ మండల బిఆర్ఎస్ పార్టీ మైనారిటీ యువ నాయకులు ముబీన్ జన్మదినాన్ని పురస్కరించుకొని జన్మదిన వేడుకలు హైదరాబాద్ లో మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి నివాసంలో మహేష్ రెడ్డి మరియు పార్టీ శ్రేణుల మధ్య ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా మహేష్ రెడ్డి నాయకులు మిత్రులు కలిసి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని మరెన్నో ఉత్తమ పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు,యువ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే సమక్షంలో పలువురు బిఆర్ఎస్‌లో చేరిక



**చౌడాపూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** చౌడాపూర్ మండల కేంద్రానికి చెందిన పి.కరుణాకర్,పి.అంజయ్య, పి.పోషయ్య, కావాలి నవీన్,మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి నివాసంలో మహేష్ రెడ్డి చేతుల మీదుగా బిఆర్ఎస్ కండువను కప్పి పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి మాట్లాడుతూ..బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఈ కార్యక్రమంలో చౌడాపూర్ మండల బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి,మాజీ జడ్పీటీసీ రాందాస్ నాయక్,ఉప సర్పంచ్ బ్యాగరి రాజు,దాసు,బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ఆర్టీసీ బస్సు,టవేరా వాహనం ఢీ.. పలువురికి గాయాలు



**ఇబ్రహీంపట్నం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలం మేడిపల్లి గ్రామ శివారులో ఆర్టీసీ బస్, టవేరా వాహనం ఢీ కొట్టిన ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో గల మేడిపల్లి గ్రామ శివారులో ఉదయం కోరుట్ల నుండి కానుగపూర్ దైవ దర్శనం కు టవేరా వాహనలో వెళ్తున్న వారికీ ఎదురుగా వస్తున్నా ఆర్టీసీ బస్ ఢీ కొట్టడడంతో 4 గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మెట్ పల్లి ప్రభుత్వ ఆసుపత్రకి తరలించి చికిత్స అందిస్తున్నట్లు పోలీస్ లు తెలిపారు.

## గడి పెద్దాపూర్ గ్రామానికి బస్సు సేవలు



**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** అల్లాదుర్గం మండలంలోని గడి పెద్దాపూర్ గ్రామానికి బస్సు సేవలు ప్రారంభమయ్యాయి.గతంలో ఆ గ్రామానికి బస్సు సేవలు ఉండగా కొంతకాలంగా నిలిపివేశారు. మరలా గ్రామస్థులు సంబంధిత అధికారులతో మాట్లాడి తిరిగి గడి పెద్దాపూర్ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించారు. NKD,డిపో బస్సు SRD, నుంచి జగిర్యాల మీదుగా NKD, వెళుతున్న బస్సు గడి పెద్దాపూర్ గ్రామానికి కూడా వెళుతుందని వారు తెలిపారు.ఉదయం సాయంత్రం వేళకు సేవలు అందుతాయన్నారు.

## 'నీతి పద్య రత్నావళి' ఆవిష్కరణ

- భారీగా హాజరైన కవులు కళాకారులు
- సంగీతం భారతీయ సంస్కృతి పునాది
- సత్య సాహిత్యం జ్ఞాపకశక్తికి అవసరం





**నవాబుపేట,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో నంబియార్ ఆశ్రమం, పద్యపదభారతి ఆధ్వర్యంలో బాలబాలికల పద్యకంఠస్థ పోటీలకు ఉపయోగకరమైన 'నీతి పద్య రత్నావళి' సంకలనాన్ని సోమవారం ఆవిష్కరించారు.ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ వ్యాపారవేత్త శ్రీశైలం హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆధునిక విద్యతో పాటు పద్య సాహిత్యం బాలల సృజనాత్మకత, జ్ఞాపకశక్తి పెంపొందిస్తుందని అన్నారు. పద్యపదభారతి గౌరవాధ్యక్షులు బందెప్ప గౌడ్ తెలుగు పద్యాన్ని విస్మరించడమే బాలల్లో దురాచారాలకు కారణమవుతోందని తెలిపారు. సంస్థ అధ్యక్షులు బొబ్లాద్ రాఘవేంద్రాచార్య మాట్లాడుతూ సంగీతం, సాహిత్యం భారతీయ సంస్కృతికి పునాదులని పేర్కొన్నారు. డాక్టర్ మలుగ అంజయ్య అవధాని పద్య కంఠస్థ పోటీల ద్వారా దేశభక్తి, దైవభక్తి పెంపొందుతాయని అన్నారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో కవులు పద్య ప్రాశస్త్యాన్ని కవితల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో సర్వోత్తమ్ పంతులు, అంజయ్య, విట్టల్ రెడ్డి, పద్యపదభారతి ప్రధాన కార్యదర్శి డాక్టర్ మున్నూరు రాజు, మల్కా నెల్లి లాల్ రెడ్డి,సుధాకర్ గౌడ్, రెడ్యా రాథోడ్, దివాకర శాస్త్రి,ఎన్నారం శ్రీనివాస్, విష్ణువర్ధన్ రెడ్డి, వీరవసంత్, శ్రీరాములు, భగవద్గీత రాములు, శ్రీనివాస ఆచారి,కందాద నాగిరెడ్డి,రమానాథ్,అంజయ్య గౌడ్ గార్లు, భజన భక్తులు తదితరులు పాల్గొన్నారు. పలువురు కవులు,సాహితీవేత్తలు, భజన భక్తులు పాల్గొన్నారు.

## బైకు అదుపుతప్పి యువకుడు అక్కడికక్కడే మృతి



**చౌడాపూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** బైకు అదుపుతప్పి యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు ఆదివారం రాత్రి కుల్కచర్ల నుండి కాముని పల్లి కి వెళ్తూ రోడ్డు టర్నింగ్ బైక్ స్పీడ్ లో కంట్రోల్ అవ్వకపోవడంతో రోడ్డు పక్కకు వెళ్ళిపోయి రోడ్డు ప్రక్కన ఉన్న చెట్టుకు గుద్దుకొని స్పాట్లో చనిపోయాడు చౌడపూర్ మండలం వాల్యా నాయక్ పంచాయతీ అనుబంధ గ్రామం రామ్ సింగ్ నాయక్ చెందిన సంజీవ్ (22)గా పోలీసులు గుర్తించారు.

## సంక్రాంతి పండుగలో సురక్షిత గాలి పటాలకే అనుమతి

**అల్లాదుర్గం ఎస్ఐ శంకర్**



**అల్లదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** అల్లదుర్గం సంక్రాంతి పండుగ సందర్భంగా గాలి పటాలు ఎగరేసే సమయంలో చైనా మాంజా వినియోగం వల్ల తలెత్తే ప్రమాదాలపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని అల్లాదుర్గం మండల ఎస్సై శంకర్ తెలిపారు.అల్లాదుర్గం మండలంలోని పలు గ్రామాల్లో గాలి పటాల వినోదం పేరుతో చైనా మాంజా వాడటం వల్ల పక్షులు, మనుషులు, పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతోందన్నారు.గాలి పటాలు ఎగరడానికి ఉపయోగించే నైలాన్, సింథటిక్ దారాలకు పూత పూసిన చైనా మాంజా అత్యంత ప్రమాదకరమని తెలిపారు.ఈ మాంజా కారణంగా పక్షులు గాయపడటం,మరణించడం,ద్విచక్ర వాహనదారులకు ప్రమాదాలు జరగడం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు.ఈ నేపథ్యంలో జాతీయ హరిత ట్రైబ్యునల్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో చైనా మాంజా వినియోగాన్ని పూర్తిగా నిషేధించినట్లు వెల్లడించారు.చైనా మాంజాను నిల్వ చేసినా,రవాణా చేసినా, తయారు చేసినా లేదా అమ్మినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కేసుల్లో బీఎన్ఎస్ సెక్షన్ 223, 125తో పాటు పర్యావరణ పరిరక్షణ చట్టం సెక్షన్ 5, 15 కింద కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఎవరైనా చైనా మాంజా తయారీ,అమ్మకం లేదా రవాణా చేస్తున్నట్లు సమాచారం ఉంటే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని ఎస్సై శంకర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతోనే ప్రమాదాలను నివారించి పండుగను సురక్షితంగా జరుపుకోవచ్చన్నారు.

## రైతు–కార్మిక–పేదల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



- సీపీఎం గ్రామ శాఖ డిమాండ్
- ఉపాధి హామీ పేరు మార్చొద్దు

**మోమిన్ పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

మోమిన్‌పేట మండల పరిధిలోని కోలుకుంద గ్రామంలో ఆదివారం సీపీఎం గ్రామ శాఖ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామంలో నేటికీ మూడు వారాలుగా ఉపాధి హామీ పనులకు సంబంధించిన డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలని, రైతు రుణమాఫీని అందరికీ అమలు చేయాలని, రైతుబంధు పథకాన్ని కొనసాగించాలని కోరారు. అలాగే కొత్త పెన్షన్లను వెంటనే మంజూరు చేయాలని, పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మోమిన్‌పేట నుండి పాత కోల్కుంద - మర్పల్లి వరకు డబుల్ రోడ్డు ఏర్పాటు చేసి రోజుకు కనీసం మూడుసార్లు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించాలని, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని అన్నారు. గ్రామంలోని స్మశానవాటికల చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించి, లైట్లు, కరెంట్, బోరు మోటార్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. చదువుకున్న నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని, గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమిని పేదలకు, దళితులకు పంపిణీ చేయాలని తెలిపారు. ప్రభుత్వం గతంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని హెచ్చరించారు.కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ..అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఉపాధి హామీ పేరు మార్చే ప్రయత్నాలను విరమించుకోవాలని,ఉన్న చట్టాన్ని యథాతథంగా కొనసాగిస్తూ అధిక నిధులు కేటాయించి అందరికీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజా - కార్మిక పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు సతీష్,గ్రామ నాయకులు రామన్న,రాజు, అశోక్,రాజు,నరేష్, విజయ,సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## భారత గడ్డపై సీపీఐ నూరేళ్ల చరిత్ర...!




- 18న ఖమ్మంలో జరిగే సభను జయప్రదం చేయండి: సీతామహాలక్ష్మి
- శతాబ్ద కాలపు పోరాటాల జ్ఞాపకాలతో శత జయంతి ఉత్సవాలు: సింగు నరసింహారావు

**కూసుమంచి,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) పుట్టి భారత గడ్డపై నూరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా.. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగ్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.సీతామహాలక్ష్మి నేతృత్వంలో సత్తుపల్లి లో ప్రారంభమైన సీపీఐ జిల్లా ప్రచార జాతా ఆదివారం కూసుమంచి మండలానికి చేరింది .ఈ సందర్భంగా..కూసుమంచి మండల కార్యదర్శి భూక్య నరసింహ ఆధ్వర్యంలో, స్వాగతం పలికారు. అనంతరం సెంటర్ లో కార్నర్ మీటింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీత మహాలక్ష్మి మాట్లాడుతూ..భారత కమ్యూనిస్టు పార్టీ నూరేళ్ల చరిత్రలో అలుపెరగని పోరాటాలు చేసి అను నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. అనేక రాష్ట్రాల్లో సాయుధ పోరాటాలు, దేశ వ్యాప్తంగా సమరశీల పోరాటాలు నిర్వహించిన చరిత్ర సిపిఐకి ఉందన్నారు. కమ్యూనిస్టులపై మతోన్మాద దాడులు పెరిగిపోయాయని,ఈ క్రమంలో ప్రజలు చైతన్యవంతులై ఈ మతోన్మాద ప్రభుత్వానికి బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని అన్నారు.అనంతరం ప్రచార జాత మండలంలోని గైగోళ్లపల్లి, లాల్ సింగ్ సింగ్ తండా, సంధ్య తాండ మీదుగా తిరుమలయపాలెం మండలానికి చేరుకుంది.గైగోళ్ళపల్లి లో నిర్వహించిన కార్నర్ మీటింగ్ లో ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగ్ నరసింహారావు మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం జిల్లాకు ఒక సుదీర్ఘమైన చరిత్ర ఉందని, గైగోళ్ళపల్లి గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు అమరజీవి కామ్రేడ్ సంగబత్తుల వెంకటరెడ్డి పేద ప్రజల సమస్యలపై అనేక పోరాటాలు చేసి భూమి లేని నిరుపేదలకు వందల ఎకరాల భూమిని పంచి ఇచ్చిన ఘనత ఉందన్నారు. పోరాటాల ఖిల్లాగా పేరుపొందిన ఖమ్మం గడ్డపై దేశవ్యాప్త భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ద కాలపు పోరాటాల జ్ఞాపకాలతో శత జయంతి ఉత్సవాల ముగింపు సభ జరుగుతుందని,ఈ సభకు వేలాదిగా గ్రామ, గ్రామాన సిపిఐ నాయకులు, కార్యకర్తలు,అనుబంధ సంఘాల ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు కత్రోజు పాండు రంగాచారి, సీపీఐ జిల్లా సమితి సభ్యులు గుండెపొంగు మల్లేష్,మండల కార్యదర్శి భూక్యా నరసింహ,సహాయ కార్యదర్శి జిల్లా లింగయ్య,లాల్ సింగ్ తండా శాఖ కార్యదర్శి భూక్యా శ్రీకాంత్, గిరిజన సమాఖ్య మండల అధ్యక్షులు వీరన్న నాయక్,నాయకులు జిల్లా నాగరాజు, చెరుకుపల్లి మల్సూరు,గుండెపంగు మధు, జిల్లా రంగమ్మ,విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## జీళ్ళచెరువు 1వ వార్డులో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

**స్వయంగా డ్రైనేజీ పనులు చేసినా కాంగ్రెస్ నాయకుడు అంజయ్య**



**కూసుమంచి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కూసుమంచి మండలంలోని జీళ్ళచెరువు గ్రామం, 1వ వార్డు మందుల బజార్ లో వార్డు సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెండ్ర అంజయ్య ఆధ్వర్యంలో ఆదివారం పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా నిర్వహించారు. మందుల బజార్ లో పారిశుద్ధ్యం, డ్రైనేజీ సమస్య,తాగు నీటి పైప్ లైన్ లీకేజీ మరమ్మత్తులు సమస్యలు ఉండటంతో స్థానికులు కోరిక మేరకు స్థానిక మందుల కుల యువకులతో కలిసి పనులు చేపట్టారు. డ్రైనేజీలోని చెత్తను, పెరుకపోయిన బురదను తొలిగించారు. కాలువను శుభ్రం చేసి, నిల్వ ఉన్న నీటిని తొలగించారు.. గుమ్మడెల్లి బిక్షం ఇంటివద్ద తాగునీటీ పైప్ లైన్ కు లీకేజీకి నుంచి భారీగా నీరు వరద పారుతుండటంతో యువకులతో కలిసి మరమ్మత్తులు చేయించారు.. గ్రామంలోని 1వ వార్డులో గత పది రోజులుగా వరుసగా పనులు చేస్తుండటంతో ఆ వార్డు ప్రజలు, గ్రామస్థులు పెండ్ర అంజయ్య ను అభినందించారు.

## తెలంగాణ వీరశైవ జంగమ అర్చక సంక్షేమ సంఘం జిల్లా స్థాయి సమావేశం

**మఠం వీరేశం స్వామి ఏకగ్రీవ ఎన్నిక**



**మోమిన్ పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** తెలంగాణ వీరశైవ జంగమ అర్చక పూరోహిత సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పురంతు వీరయ్య స్వామి ఆదేశాల మేరకు ఆదివారం మర్పల్లి మండల పరిధిలోని సిరిపురం గ్రామంలోని శ్రీ వీరభద్ర ఈశ్వర స్వామి ఆలయంలో జిల్లా స్థాయి సమావేశం ఘనంగా నిర్వహించారు.ఈ సమావేశం వికారాబాద్ జిల్లా గౌరవ అధ్యక్షులు మదుపతి శివశంకర్ స్వామి,జిల్లా అధ్యక్షుడు ఆధ్వర్యంలో జరిగింది.ఈ సమావేశంలో ఐడి కార్డులు కలిగిన సుమారు 50 మంది వీరశైవ జంగమ అర్చకులు పాల్గొని మఠం వీరేశం స్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అర్చకుల సంక్షేమం, హక్కులు, ఐక్యతను బలోపేతం చేయడమే లక్ష్యంగా సంఘం పనిచేస్తుందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.సమావేశంలో పాల్గొన్న అర్చకులు మఠం నాగరాజు హూస్వామి,మఠం కాశీనాథ్ స్వామి, శేఖర్ స్వామి, చంద్రశేఖర్ స్వామి, సంగయ్య స్వామి, శివకుమార్ స్వామి, ప్రవీణ్ కుమార్ స్వామి తదితర జిల్లా అర్చకులు సంఘానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..అర్చకుల సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందని, సంఘం ద్వారా ప్రభుత్వానికి అర్చకుల గళాన్ని వినిపిస్తామని తెలిపారు. కార్యక్రమం శాంతియుతంగా,ఐక్యత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

## మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసిన నూతన సర్పంచులు



**మోమిన్ పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మోమిన్‌పేట్ మండల పరిధిలో నూతనంగా ఎన్నికైన టేకులపల్లి గ్రామ సర్పంచ్ బండ విష్ణువర్ధన్ రెడ్డి,ఎన్కతల గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ గౌడ్‌లు ఆదివారం మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందజేశారు.ఈ కార్యక్రమం వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్,మోమిన్‌పేట మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వెంకట్ ఆధ్వర్యంలో ఆమె నివాసంలో జరిగింది.ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ..రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి నాయకుడు,కార్యకర్త సమన్వయంతో సైనికుల్లా పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి అందరూ ఐక్యతతో ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు.

# మహిళలు శాసనాలు శాసించే స్థాయికి ఎదగాలి

- బీసీ సేన జాతీయ అధ్యక్షులు బర్క కృష్ణ
- రాజకీయాల్లో మహిళల పాత్ర పెంచడమే లక్ష్యం. బీసీ సేన జిల్లా అధ్యక్షుడు సదర్ శీను
- మహిళా నాయకత్వానికి బీసీ సేన అండగా నిలుస్తుంది
- మహబూబ్ జిల్లా అధ్యక్షులు సుప్ప ప్రకాష్
- ప్రస్తుత రాజకీయాలలో మహిళల పాత్ర చాలా ముఖ్యం
- షాద్నగర్ నియోజకవర్గ ఇన్చార్జ్ జయ శ్రీకాంత్
- రాజకీయాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పిస్తాం
- బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు వరప్రసాద్
- మహిళా సర్పంచులు అందరూ గ్రామాలలోని మహిళలకు ఉపాది కల్పించండి
- షాద్ నగర్ కోర్ట్ మహిళా పబ్లిక్ ప్రాసిక్యూటర్ సభియా సుల్తాన
- సర్పంచ్ లు ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దాలి
- హాజీపల్లి మాజీ సర్పంచ్ సింగారం శ్రీనివాస్



**షాద్ నగర్ , స్నేహిత ఎక్స్ ప్రెస్:** గ్రామ పాలనలో మహిళా నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో జాతీయ బీసీ సేన ఆధ్వర్యంలో షాద్‌నగర్ నియోజకవర్గానికి చెందిన మహిళా సర్పంచులు, వార్డు సభ్యులకు 148 మంది మహిళా సభ్యులను ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం జాతీయ బీసీ సేన నియోజకవర్గ ఇంచార్జి జయ శ్రీకాంత్ అధ్యక్షతనతో జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాతీయ బీసీ సేన అధ్యక్షులు బర్కా కృష్ణ, బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు వరప్రసాద్ యాదవ్, మహబూబ్నగర్ జిల్లా బీసీ సేన అధ్యక్షులు సూప్ప ప్రకాష్,రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సదర్ శ్రీను, మహిళ ముఖ్య అతిథులు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నబియా సుల్తానా,మహిళా ప్రజాప్రతినిధులను సత్కరించారు.ఎన్నికల్లో విజయం సాధించిన మహిళా సర్పంచులు, వార్డు సభ్యులను ఘనంగా సన్మానించి, వారి సేవలను అభినందించారు.

జాతీయ బీసీ సేన అధ్యక్షులు బర్కా కృష్ణ మాట్లాడుతూ... మహిళలను రాజకీయంగా ఎదిగే దిశగా తీసుకెళ్లడమే బీసీ సేన ప్రధాన లక్ష్యమని తెలిపారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించేందుకు బీసీ సేన నిరంతరం పోరాటం చేస్తోందని అన్నారు. శాసనసభలు, పార్లమెంటుల్లో మహిళల ప్రాతినిధ్యం మరింత పెరగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జయ శ్రీకాంత్ మాట్లాడుతూ...ప్రజల విశ్వాసంతో గెలిచిన మహిళా ప్రజాప్రతినిధులను సత్కరించడం ద్వారా వారిలో మరింత ఆత్మవిశ్వాసం, సేవాభావం పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు అందించిన తీర్పును గౌరవిస్తూ, గ్రామాల అభివృద్ధికి అంకితభావంతో పని చేయాలని సూచించారు. మహిళలు భవిష్యత్తులో ఎమ్మెల్యేలు, ఎంపీలు వంటి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. బీసీ సేన రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సదర్ శ్రీను మాట్లాడుతూ... బీసీ సేన ఎప్పటికీ అణగారిన వర్గాలకు అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ప్రజలు అప్పగించిన అధికారాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని, మహిళలు రాజకీయ, సామాజిక రంగాల్లో తమ సత్తాను నిరూపించుకోవాలని పిలుపునిచ్చారు.ప్రతి గ్రామంలో బీసీ సేన కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని సూచించిన ఆయన, బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేకూర్చేలా సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో మహిళలు రాజ్యాధికారం సాధించే స్థాయికి ఎదగాలని, ఆ దిశగా బీసీ సేన తన శక్తిని చాటుతుందని స్పష్టం చేశారు.అదేవిధంగా షాద్‌నగర్ నియోజకవర్గంలో బీసీ సేనను పటిష్టంగా నిర్మించినందుకు నియోజకవర్గ ఇంచార్జి జయ శ్రీకాంత్ను అభినందించారు. బీసీ సేన బడుగు, బలహీన వర్గాలకు న్యాయం అందించేందుకు బలమైన పోరాటం చేస్తుందని, అన్ని వర్గాలకు సంపూర్ణ న్యాయం అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మీడియా ఇన్చార్జ్ గిరిబాబు,షాబాద్ మండల అధ్యక్షుడు దయాకర్, కోర్ కమిటీ అధ్యక్షుడు చిన్న బాల్ రాజ్ చౌదరి గూడ గ్రామ కమిటీ అధ్యక్షులు పుర్ర రాజు బీసీ సేన మండల ఉపాధ్యక్షుడు అమృతం దామోదర్, కొందుర్గ్ మహిళా అధ్యక్షులు ఈరపురం అనిత,నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి భూషం నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ గుడి నిర్మాణానికి ముదిరాజ్ కుటుంబీకులు సహకరించాలి

**బిఆర్ఎస్ పార్టీ మండల ప్రచార కార్యదర్శి బుద్ధుల బిక్షపతి**



**శివ్వంపేట , స్నేహిత ఎక్స్ ప్రెస్:** మెదక్ జిల్లా శివ్వంపేట మండలం దొంతి గ్రామంలో పెద్దమ్మ గుడి నిర్మించాలని ముదిరాజ్ కుటుంబీకులు ఏకమై అభిప్రాయానికి వచ్చినట్లు బి ఆర్ ఎస్ పార్టీ మండల ప్రచార కార్యదర్శి బుద్ధుల బిక్షపతి ఆదివారం నాడు మాట్లాడుతూ తెలిపారు. ముదిరాజ్ కుటుంబీకులకు కుల దైవమైన పెద్దమ్మ తల్లి దేవాలయాన్ని త్వరలో గ్రామంలో ప్రారంభించారని అందరూ కలిసి యోచిస్తున్నామని ఆయన తెలిపారు. ఇటీవల జరిగిన సమావేశంలో దేవాలయం నిర్మాణం పై జరిగిన సమావేశంలో నాయకులు సుక్క శ్రీనివాస్, సుక్క మల్లేశం, చిన్నగారి మల్లేష్, కుల్ల గారి శేఖర్, కొత్త యాదగిరి, జెసిబి పిట్ల సత్యనారాయణ, తదితర ముదిరాజ్ రాజకీయ నాయకులు పాల్గొని చర్చించడం జరిగిందని ఆయన చెప్పారు. త్వరలో ముదిరాజ్ కుటుంబీకులు అందరూ కలిసి పెద్దమ్మ తల్లి దేవాలయం నిర్మించడానికి సిద్ధంగా ఉన్నారని బుద్ధుల బిక్షపతి తెలిపారు. ఇదిలా ఉండగా ఈ దేవాలయం నిర్మాణానికి ముదిరాజ్ కులస్తులు పూర్తి సహాయ సహకారాలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఉప సర్పంచుల మండల ఫోరం అధ్యక్షునిగా ఎన్నం రాజేందర్ రెడ్డి



**నార్సింగి , స్నేహిత ఎక్స్ ప్రెస్:** మెదక్ జిల్లా నార్సింగి మండల ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షునిగా ఎన్నం రాజేందర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా మోహన్ నర్సంపల్లి తాండ, ప్రధాన కార్యదర్శిగా మీరు దొడ్డి రేఖ వల్లూర్, కార్యదర్శులుగా బొమ్మగారి ప్రభాకర్ నర్సంపల్లి. విజయ్ షేర్ పల్లి, కోశాదారిగా మహేష్ సంకాపూర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ ఫోరం అధ్యక్షునిగా ఎన్నికైన యెన్నం రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నన్ను మండల ఉప సర్పంచ్ల అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రతి ఒక్కరికి న్యాయం జరిగే విధంగా పనిచేస్తానని వారన్నారు.

## కేంద్రమంత్రి కిషన్ రెడ్డి నీ కలిసిన బీజేపీ సీనియర్ నాయకుడు పైడి ఎల్లారెడ్డి



**కామారెడ్డి , స్నేహిత ఎక్స్ ప్రెస్:** హైదరాబాద్ లో ఆదివారం బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకుడు, ప్రముఖ శాస్త్రవేత్త డా.పైడి ఎల్లారెడ్డి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాదంత రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ, ప్రజా సంక్షేమాలలో భాగస్వామ్యం కావాలని కిషన్ రెడ్డి తెలిపినట్లు ఆయన వివరించారు.

## అండగా ఉంటా

**మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్**



**కామారెడ్డి , స్నేహిత ఎక్స్ ప్రెస్:** బాధిత కుటుంబాలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ హామీ ఇచ్చారు. రాజంపేటలో వివిధ కారణాలతో ఇబ్బందుల్లో ఉన్న పలు కుటుంబాలను ఆయన స్వయంగా కలిసి పరామర్శించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఆయన మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలు అధైర్య పడొద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## సిద్ధాపూర్ రిజర్వాయర్ పనులను పరిశీలించిన పోచారం ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు



**మోస్రా , స్నేహిత ఎక్స్ ప్రెస్:** నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం వర్ని మండలంలోని సిద్ధాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనుల పురోగతిని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డితో కలిసి రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌తో మాట్లాడిన వారు, రిజర్వాయర్ నిర్మాణ పనులను నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని, పనులలో ఎలాంటి నాణ్యత లోపాలు లేకుండా అత్యున్నత ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు. సాగునీటి వసతుల మెరుగుదలతో రైతులకు దీర్ఘకాలిక లాభం చేకూరుతుందని, ప్రాంతీయ వ్యవసాయాభివృద్ధికి ఈ ప్రాజెక్టు కీలకమని వారు పేర్కొన్నారు. అనంతరం బాన్సువాడ గ్రామీణ మండలంలోని కోనాపూర్-హన్మాజీపేట్ ప్రాంతంలో నూతనంగా నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ గిరిజన బాలికల గురుకుల పాఠశాల పనుల పురోగతిని కూడా వారు పరిశీలించారు. విద్యార్థినులకు సురక్షిత వసతులు, నాణ్యమైన విద్య అందేలా మౌలిక వసతుల అభివృద్ధి వేగవంతం చేయాలని అధికారులకు సూచనలు చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల నిర్మాణాలు సమయానుకూలంగా పూర్తి కావాలన్నదే లక్ష్యమని ఈ సందర్భంగా తెలిపారు.

## సిఐటియు లో చేరిన ఎలక్ట్రీషియన్ వర్కర్స్



**శంకరపట్నం , స్నేహిత ఎక్స్ ప్రెస్:** శంకరపట్నం మండల ఎలక్ట్రీషియన్ వర్కర్స్ యూనియన్ సభ్యులు సిఐటియు అనుబంధ సంస్థ అయిన 'తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్'లో ఆదివారం చేరారు. వారికి జిల్లా నాయకులు ఎడ్ల రమేష్, కదిరే రమేష్, ఇమ్మడి చక్రపాణి సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎడ్ల రమేష్ మాట్లాడుతూ,మీసేవా కేంద్రాల్లో లేబర్ వెల్ఫేర్ బోర్డు కార్డుల నమోదుకు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, అక్రమ వసూళ్లకు పాల్పడే కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అర్హులైన కార్మికులందరికీ యుద్ధప్రాతిపదికన రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్ పూర్తి చేయాలని, లేనిపక్షంలో లేబర్ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. కేంద్రం కొత్త లేబర్ కోడ్లను తీసుకురావడం వల్ల భవన నిర్మాణ కార్మికుల హక్కులకు భంగం వాటిల్లుతుందని, వెల్ఫేర్ బోర్డు నిధులను ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు షేక్ అహ్మద్, ఉపాధ్యక్షులు రాజు, నాయకులు సంజీవ్, ఎం.రాజు, బాలకృష్ణ, సమీ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సావిత్రి బాయి పూలే జన్మదిన వేడుకలు



**ముప్కాల్ , స్నేహిత ఎక్స్ ప్రెస్:** ముప్కాల్ మండలం నాగంపెట్ గ్రామంలో ఆదివారం రోజు చదువుల తల్లి భారతదేశ మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయురాలు తల్లి సావిత్రి భాయి పులే 195 వ జన్మదిన వేడుకలు ఆదివారం రోజు, మహిళ సంఘం భవనం లో గ్రామం లోని ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో ఉద్యోగులుగా రాణిస్తున్న మహిళలను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమన్నీ గ్రామ యువకులు ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు నల్ల వినయ్, కార్యకర్త నల్ల శ్రీకాంత్, బిఆర్ యస్ పార్టీ కార్యకర్త బదనపల్లి ప్రశాంత్ ఆధ్వర్యంలో నిర్వహించగ ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ దాసరి గంగాధర్ యాదవ్, నాగంపేట్ గ్రామ పంచాయతీ కార్యదర్శి గౌతమి, గ్రామ ఉపసర్పంచ్ పంతంగి మదన్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల ఇంచార్జీ కొల్వి శ్రీకాంత్, మహిళా సంఘం CC విజయలక్ష్మి, మహిళ సంఘం అధ్యకురాలు నల్ల మంజుల, CA నన్నెపు వనిత మరియు మహిళా సంఘాల సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మంచిర్యాల మోడల్ స్కూల్‌ను సందర్శించిన పెద్దపల్లి ఎంపీ



**రామగుండం , స్నేహిత ఎక్స్ ప్రెస్:** మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్‌లో ఉన్న మోడల్ స్కూల్‌ను పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో స్నేహపూర్వకంగా మాట్లాడి వారి విద్యా ప్రగతి, పాఠశాలలో అందుతున్న సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, భవిష్యత్తులో కల్పించాల్సిన సదుపాయాలపై అధికారులతో చర్చించిన ఎంపీ, ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కష్టపడి చదవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహార విందులో పాల్గొని వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య కోసం తనవంతు పూర్తి సహకారం అందిస్తానని ఎంపీ గడ్డం వంశీకృష్ణ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఆర్.ఎం.పి మరియు పి.ఎం.పి అసోసియేషన్ సమావేశం




**కథలాపూర్ , స్నేహిత ఎక్స్ ప్రెస్:** జగిత్యాల జిల్లా ఆర్.ఎం.పి మరియు పి.ఎం.పి అసోసియేషన్ సమావేశం జరిగింది. నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీలో కోరుట్ల డివిజన్ అధ్యక్షుడు బత్తుల అశోక్ ని జిల్లా అధికార ప్రతినిధిగా నియమించగా, కథలాపూర్ మండల అధ్యక్షుడు నరసింహులు ని జోనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించడం జరిగింది. జోనల్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. మరియు నూతనంగా సర్పంచ్ గా ఎన్నికలలో గెలిచినటువంటి రామిల్ల రమేష్ కలిగోట జిల్లా ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్ఎంపీలు పీఎంపీలు పాల్గొన్నారు.

## ప్రకృతి ఒడిలో కొలువైన కొచ్చేరి మైసమ్మ తల్లి

- రోజురోజుకి పెరుగుతున్న భక్తుల రద్దీ
- ఆది, మంగళ, శుక్రవారాల్లో ప్రత్యేక పూజలు



**నసురుల్లాబాద్ , స్నేహిత ఎక్స్ ప్రెస్:** నసురుల్లాబాద్ మండల పరిధిలో ఆదివారం రోజున అడవి ప్రాంతంలో గల కొచ్చర మైసమ్మ తల్లి వెలసిన మైసమ్మ అమ్మవారు భక్తులు కొంగు బంగారంగా పూజల పూజలందుకుంటుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన నాటి నుంచి అమ్మవారి ఆలయం దిన దిన అభివృద్ధికి చెందుతుంది. కేవలం మర్రి ఊడలోచెట్టుకింద కొలువు దీరిన అమ్మవారి ఆలయ ప్రాంగణంలో.. దాతలు, గ్రామ పెద్దల, నాయకుల. చొరవ కారణంగా పూర్తిగా సిసితో నిర్మించారు. దీంతోపాటు స్థానికంగా నీటి సౌకర్య కోసం వాటర్ ట్యాంకులు, మురుకుదొడ్లు షెడ్లు నిర్మించడంతో భక్తులకు, సకల సౌకర్యాలు లభించాయి. పొరుగు రాష్ట్రాలైన. కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్ర, ప్రాంతాల భక్తులు నిత్యం ఇక్కడికి వస్తుంటారు. ఆలయం వద్ద సకల సౌకర్యాలు ఉన్నాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ ప్రజలు ఆలయ కమిటీ సభ్యులుగా ఉంటూ ప్రతి నిత్యం ధూప దీప నైవేద్యాలకు అందిస్తుంటారు. 100 సంవత్సరాలకు పూర్వ గ్రామస్తులకు అమ్మవారు ఆనాటికి నిత్యం పూజలు అందుకుంటున్నది. కొచ్చరి మైసమ్మ తల్లికి మొక్కిన మొక్కులు ఒడిబియ్యము, ముక్కుపులుక, అమ్మవారి కండ్లు, ఉయ్యాలను, ఘనంగా మొక్కలు తీర్చుకుంటున్నారు. ప్రతి సంవత్సరం ఆషాడ మాసంలో చివరి శుక్రవారం గ్రామం నుండి భారీగా మహిళలు పెద్ద ఎత్తైన బోనాలు మైసమ్మ తల్లికి సమర్పిస్తారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ప్రజాప్రతినిధులను సన్మానించిన నాగుర్ల



**పరకాల, స్నేహిత ఎక్స్ ప్రెస్:** నడికూడ సర్పంచ్ కుడ్ల మలహలరావు, వరికోల్ ఉపసర్పంచ్ మురాల భుజంగరావులను ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నాగుర్ల వెంకటేశ్వరరావు హనుమకొండలో ఘనంగా సన్మానించారు. గ్రామాభివృద్ధికి నిబద్ధతతో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు లోకటి నాగేష్, వరికెల కిషన్ రావు, మోకిడి రాజు తదితరులు పాల్గొన్నారు.



## ఇబ్రా చిట్టెంపల్లిలో నూతన శకం ఆరంభం

- తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా తొలి అడుగులు
- కొత్త సర్పంచ్ వందన విజయ్‌కు గ్రామస్తుల బ్రహ్మారథం



**మోమిన్ పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలంలోని ఇబ్రా చిట్టెంపల్లి గ్రామంలో నూతన శకం ఆరంభమైంది. ఇటీవలే గ్రామ సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన యువ నాయకుడు వందన విజయ్ ప్రజా సంకల్పంతో ముందడుగు వేస్తూ, ఏళ్ల తరబడి గ్రామాన్ని వేధిస్తున్న తాగునీటి సమస్య పరిష్కారానికి కార్యాచరణ ప్రారంభించారు.సర్పంచ్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే గ్రామంలోని బోర్లు, పైప్‌లైన్‌లు, వాటర్ ట్యాంకుల పరిస్థితిని స్వయంగా పరిశీలించిన వందన విజయ్, సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ..తక్షణ చర్యలకు శ్రీకారం చుట్టారు.తాగునీటి సరఫరాలో లోపాలను గుర్తించి, ప్రతి ఇంటికీ నిరంతర స్వచ్ఛమైన నీరు అందాలనే లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా పనులు ప్రారంభించడం గ్రామస్తుల్లో విశేష హర్షం కలిగించింది. యువతతో పాటు మహిళలు,వృద్ధులు సైతం సర్పంచ్ వందన విజయ్ చేపడుతున్న ప్రజాహిత కార్యక్రమాలకు మద్దతు తెలుపుతూ బ్రహ్మరథం పడుతున్నారు. "మాటల్లో కాదు, పనుల్లో చూపిస్తున్న నాయకత్వం ఇదే" అంటూ గ్రామ ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు .ఈ సందర్భంగా వందన విజయ్ మాట్లాడుతూ..గ్రామ అభివృద్ధే నా లక్ష్యం,తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, విద్య వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టి ఇబ్రా చిట్టెంపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాను" అని స్పష్టం చేశారు.ఇబ్రాచిట్టెంపల్లిలో మొదలైన ఈ మార్పు ప్రయాణం భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు దారితీయనుందని గ్రామ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కొత్త సర్పంచ్ నాయకత్వంలో గ్రామం అభివృద్ధి బాటలో వేగంగా ముందుకెళ్తుందనే విశ్వాసం ప్రతి ఒక్కరిలో కనిపిస్తోంది.

## విద్యార్థులు ఇష్టపడి చదివితేనే మంచి ఫలితాలు



**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

విద్యార్థులు కష్టపడి మాత్రమే కాకుండా ఇష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి అన్నారు. శనివారం నారాయణఖేడ్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆమె ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎనిమిదో తరగతి విద్యార్థులతో కలిసి బయాలజీ పాఠ్యాంశానికి సంబంధించిన పలు ప్రశ్నలు అడిగి వారి ప్రతిభను పరిశీలించారు.అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడిన సబ్ కలెక్టర్, పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే కష్టపడి చదవాల్సిందే అని సూచించారు. మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు,ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను ప్రోత్సహించారు. అదేవిధంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ సమయ పాలన తప్పనిసరిగా పాటించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పదో తరగతిలో 100 శాతం ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఇప్పటి నుంచి ప్రతి వారం ఒకసారి పాఠశాలను సందర్శిస్తానని వెల్లడించిన సబ్ కలెక్టర్, విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి వచ్చి చెప్పవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ జాతిపిత జైపాల్ సింగ్ ముండా జయంతి వేడుకలు

**జీలుగుమిల్లి , స్నేహిత ఎక్స్ ప్రెస్:** కే.ఆర్.పురం ఐటిడిఏ కార్యాలయంలో ఆదివాసీ జాతిపిత జైపాల్ సింగ్ ముండా జయంతి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు ముఖ్యంగా హాజరై జైపాల్ సింగ్ ముండా చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ళ బొజ్జిరెడ్డి ఎమ్మెల్యే చిర్రి బాలరాజు హృదయపూర్వక స్వాగతం పలికి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం జైపాల్ సింగ్ ముండా జీవితం, ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ సభను ఉద్దేశించి ప్రసంగించారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ, జైపాల్ సింగ్ ముండా గిరిజన సమాజానికి ఆత్మగౌరవాన్ని, హక్కుల కోసం పోరాడే ధైర్యాన్ని అందించిన మహనీయుడని కొనియాడారు.